సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024

రైల్వేస్టేషన్లకు ఆధునిక హంగులు

- జడ్చర్ల, గద్వాలకు రూ.20.43 కోట్లు కేటాయింపు
- 'అమృత్ భారత్' పనులను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- హాజరైన ఎంపీలు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పోతుగంటి రాములు
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /19.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

మోగిన ఎమ్మెల్సీ నగారా..

- మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానంలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 28 తేదీన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక నిర్వహించనుండగా, ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు, అదే రోజున ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు మార్చి 4న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మరో మూడేళ్ల పాటు ఎమ్మెల్సీ పదవీకాలం ఉండగా గత డిసెంబర్ 8న కసిరెడ్డి రాజీనామా చేశారు. దీంతో ఎమ్మెల్సీ స్థానానికి ఖాళీ ఏర్పడింది.

నామినేషన్ల స్వీకరణ మార్చి 4	నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ మార్చి 11
నామినేషన్ల పరిశీలన మార్చి 12	నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ మార్చి 14
పోలింగ్ మార్చి 28	(ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు)
ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 2	

12 సీట్లు గెలవడం ఖాయం: డీకే అరుణ



పాలమూరు: ప్రతి కార్యకర్త వచ్చే ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. తెలంగాణలో ఈ ఎన్నికల్లో 12 సీట్లు గెలువడం ఖాయమని, ఆ దిశగానే అన్ని రకాల సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో పాటు పార్టీ నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేంద్ర పథకాలు లబ్ధిపొందిన ప్రతి లబ్ధిదారుడిని బీజేపీ కార్యకర్తలు కలవాలని సూచించారు. కేంద్రం నుంచి అందుతున్న అన్ని రకాల పథకాల తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వచ్చే మూడు నెలలు ఒక టాస్క్‌లా తీసుకొని పని చేయాలన్నారు. రేషన్‌బియ్యం కేంద్రం ప్రభుత్వం ఇస్తుంటే కాంగ్రెస్ పార్టీ బోర్డులు ఏర్పాటు చేసుకుంటుందని, ఇలాంటి ఘటనలు అడ్డుకోవాలన్నారు. సంపర్క్ అభియాన్‌పై మండలాల వారీగా ఈనెల 28, 29 తేదీలో వర్క్‌షాప్ నిర్వహించాలని, మార్చి 1, 2 తేదీలలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలన్నారు. డోకూర్ పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి, అంజయ్య, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతోనే..

పట్టాదారు పాస్ పుస్తకంలో 2.16 ఎకరాల భూమి ఉండగా.. పొజిషన్‌లో 10 గుంటలు తక్కువగా ఉంది. సర్వే కోసం మూడుసార్లు దరఖాస్తు పెట్టుకుంటే సబ్ డివిజన్ సమస్యతో పరిష్కారం దొరకడంలేదు. పక్క భూమివారు కొలతలకు ఒప్పుకోవడం లేదు. సర్వే నంబర్ మొత్తం విస్తీర్ణాన్ని కొలతలు తీయగా భూమి ఆర్ఎస్ఆర్ ప్రకారం సరిగానే ఉంది. సబ్‌డివిజన్ సమస్యతో నా పట్టా భూమి ఇతరుల కబ్జాలో ఉంది. దయచేసి నా భూమి నాకు ఇప్పించండి అంటూ హన్వాడ మండలం పెద్దదర్పల్లికి చెందిన ఓ రైతు అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం దొరకడంలేదు.

సార్.. నేను కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం బొంబాయికి వలస వెళ్తే.. ఇక్కడ కొందరు వ్యక్తులు నా భూమిలోకి జరిగి రాళ్లు పాతారు. ఏమని అడిగితే మా భూమిని సర్వే చేయించాం.. ఇక్కడి వరకు ఉందని దబాయిస్తున్నారు. దయచేసి పరిష్కారం చూపండి అంటూ జిల్లాకేంద్రం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మరో రైతు ఆవేదన ఇది.

సబ్ కమిటీ దృష్టికి వెల్లువెత్తిన భూ సమస్యలు

- గ్రామాల నుంచి వచ్చేవన్నీ వాటిపైనే..
- పరిష్కారం కోసం భూ యజమానుల ఎదురుచూపులు
- సర్వేలపై దృష్టిసారించిన రాష్ట్ర ప్రభుత్వం
- పూర్తిస్థాయి కొలతలే అంతిమ పరిష్కారమని రైతుల అభిప్రాయం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: సర్వే సమస్యలతో సతమతమవుతున్న భూ యజమానులు కలెక్టరేట్‌తో పాటు సర్వే ల్యాండ్ ఏడీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల్లో అగ్రభాగం వీటిపైనే ఉంటున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ధరణి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సబ్ కమిటీపై భూ యజమానుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. పలుమార్లు సమావేశమైన సబ్‌కమిటీ సభ్యులు ధరణితో పాటు క్షేత్రస్థాయి సమస్యలపై జిల్లా ఉన్నతాధికారుల ద్వారా పూర్తి నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం రెవెన్యూశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. భూ ప్రక్షాళనతోపాటు తహసీల్దార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు, వెంటనే ముటేషన్లు, కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాల జారీ వంటి మార్పులు చేపట్టి.. ధరణి పోర్టల్ ద్వారా భూ రికార్డులను ఆన్‌లైన్‌లోకి తెచ్చింది. కానీ, క్షేత్రస్థాయి సమస్యలకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిపై ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ పూర్తిస్థాయిలో దృష్టిసారించి ప్రక్షాళన దిశగా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. భూ సమస్యలకు సమగ్ర భూ సర్వేనే అంతిమ పరిష్కారం అనే భావనకు సబ్‌కమిటీ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించి సమగ్ర భూసర్వే చేపట్టేందుకు సూచించనుంది. ల్యాండ్ రీసర్వే చేపట్టేందుకు సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం భూ యజమానులు ఎదురుచూస్తున్నారు.

కర్ణాటక మాదిరిగా..

భూముల సర్వే మళ్లీ చేపట్టి కర్ణాటక రాష్ట్రం తరహాలో సర్వే నంబర్ల వారీగా హద్దులు నిర్ణయించాలని సబ్ కమిటీ సభ్యులు వచ్చినట్లు తెలుస్తోంది. సర్వే నంబర్లను జియో ట్యాగింగ్ చేసి పక్కాగా మ్యాపులు తయారు చేయడం ద్వారా సమస్యలు తీరే అవకాశం ఉంది. 2019లో ప్రభుత్వం చేపట్టిన భూప్రక్షాళన కార్యక్రమంలో అనేక సమస్యలు బయటపడ్డాయి. నిజాం సర్కార్‌లో నిర్వహించిన సర్వే మ్యాపుల ద్వారానే ఇప్పటికీ ల్యాండ్ సర్వే నిర్వహిస్తున్నారు. అప్పట్లో మ్యాపుల్లో పొందుపర్చిన నంబర్లు, వివరాలు ఇతర భాషల్లో ఉండటంతోపాటు అక్యూరేట్ కొలతలు లేకపోవడం కూడా సమస్యలకు కారణవుతోంది. సేత్వార్‌లో నమోదైన భూ విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో ఉన్న దానికి వ్యత్యాసం ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామాల్లో వివాదాలు తలెత్తి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భూ కొలతలు సైతం పక్కాగా ఉండేలా సమగ్ర సర్వే చేపట్టి తద్వారా క్షేత్రస్థాయికి, రికార్డుల్లో నమోదైన విస్తీర్ణాల తేడాలను సరిచేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

పక్కాగా లావాదేవీలు..

భూ సమగ్ర సర్వే ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వ కొలతలు, రికార్డులు సైతం పక్కాగా నమోదు కానున్నాయి. సర్వే నంబర్ల వారిగా హద్దులు నిర్ణయించడం వల్ల వాస్తవ విస్తీర్ణం, నక్షాలు రూపొందించి కొనుగోలు, అమ్మకాల్లో పారదర్శకత తీసుకురానున్నారు. అలాగే పట్టాదారుల విస్తీర్ణం తేల్చే అవకాశముంది. తద్వారా కబ్జాలు, హద్దుల గొడవలు, సర్వే నంబర్ల సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయి.

జియో ట్యాగింగ్..

సమగ్ర భూ సర్వే ద్వారా సర్వే నంబర్ల హద్దులు నిర్ణయించడంతో పాటు జియో ట్యాగింగ్ చేస్తారు. సర్వే నంబర్ల వారీగా భూములన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ఎప్పటికప్పుడు ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుంది. దీంతో ప్రభుత్వ భవనాలకు, ఇతర కార్యక్రమాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని సూచిస్తే ఆయా మండలాల్లో ఎక్కడ అందుబాటులో ఉందనే విషయం సులువుగా గుర్తించవచ్చు. సర్వే నంబర్లు జియో ట్యాగింగ్ చేయడం ద్వారా వాస్తవంగా ఎంత భూ విస్తీర్ణం అందుబాటులో ఉందనేది తెలుస్తుంది.

పక్కాగా ఉంటాయి..



సమగ్ర భూ సర్వే చేపడతారని చాలాకాలంగా చెబుతున్నా సాధ్యం కావడం లేదు. ప్రస్తుతం అధికారులకు వస్తున్న ఫిర్యాదులన్నీ భూ సమస్యలకు సంబంధించినవే. సమగ్ర భూ సర్వే చేపడితే కొలతలు పక్కాగా ఉంటాయి. ఎవరికీ అన్యాయం జరిగే ఆస్కారం ఉండదు. ప్రభుత్వం సమగ్ర భూ సర్వే నిర్వహిస్తే యజమానులకు మేలు జరుగుతుంది.

– లక్ష్మయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కొలతలే ప్రధాన సమస్య..



జిల్లాలో సబ్‌డివిజన్ కొలతలే ప్రధాన సమస్యగా మారుతోంది. మ్యాపులు అందుబాటులో లేకపోవడంతో కొలతలు సాధ్యపడటం లేదు. ఒకవేళ సర్వే నంబర్‌లోని పట్టాదారులందరూ ఒప్పుకొంటే ఎవరి విస్తీర్ణం వారికి కొలిచి ఇచ్చేందుకు అవకాశం ఉంది. కానీ, సబ్ డివిజన్ సమస్యను మాత్రమే కొలత చేయడానికి సాధ్యపడదు.

– కిషన్‌రావు, సర్వే ల్యాండ్ ఏడీ

జిల్లాలో భూ విస్తీర్ణం (ఎకరాలు)	సర్వే నంబర్లు	ఖాతాలు	పెండింగ్‌లో ఉన్న ఆఫ్‌లైన్ పిటిషన్లు
6,49,974	6,91,529	2,15,209	442

దుకాణాల తనిఖీ

- జిల్లాకేంద్రంలో 156 కిలోల ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల స్వాధీనం
- దుకాణదారులకు జరిమానా విధింపు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ దుకాణాల్లో 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను విక్రయిస్తుండగా సోమవారం మున్సిపల్ అధికారులు పట్టుకున్నారు. కాగా, ఈనెల 25న 'ప్లాస్టిక్‌పై నిషేధం.. అమలయ్యేనా?' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. మార్కెట్ ఏరియా, గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలో, పద్మావతికాలనీలోని సుమారు 50 దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 156 కిలోల ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి రూ.20,900 జరిమానా వసూలు చేశారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో ఓ తోడుపుబండి వద్ద జరిమానా వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు



ప్లాస్టిక్‌పై నిషేధం.. అమలయ్యేనా?

'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

పాలమూరు: చిన్నారుల నిండు జీవితానికి తప్పనిసరిగా తల్లిదండ్రులు తమ 0–5పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయించాల కలెక్టర్ రవినాయక్ సూచించారు. మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లాలో 0–5 ఏళ్ల పిల్లలు 1,10,136 మందిని గుర్తించామని, వీరికి చుక్కల మందు వేయించాలన్నారు. పోలియోరహిత జిల్లాగా మార్చడానికి వైద్యారోగ్యశాఖతో పాటు అందరూ కలిసి పని చేయాలన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అన్ని శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రూరల్ ఏరియాలో 583, అర్బన్‌లో 93 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని, 24 మొబైల్ టీంలు పని చేస్తాయని తెలిపారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, పట్టణాల్లో ముఖ్య కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేసి చుక్కల మందు వేయాలన్నారు. ప్రధానంగా ఇటుక బట్టీలు, రైస్‌మిల్లులు, వలస కార్మికుల పిల్లలు తప్పిపోకుండా వేయాలన్నారు. మార్చి 3న తప్పిపోయిన వారికి మార్చి 4, 5 తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయాలన్నారు. ఆశ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారులు కార్యక్రమం నిర్వహణలో చురుకుగా పాల్గొన్నాలని ఆదేశించారు. నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులతో పాటు లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

ఫిర్యాదులకు వాస్తవ పరిష్కారం చూపాలి

- కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలో వివిధ గ్రామాల నుంచి వచ్చి ప్రజావాణి కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదులు, వినతులకు వాస్తవ పరిష్కారం చూపాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రవినాయక్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రజలు వచ్చి తమ సమస్యల పరిష్కారం కోసం వినతులు సమర్పిస్తున్నారని, వారి సమస్యలపై సత్వరమే స్పందించి మొదటి ప్రాధాన్యతగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో ఎక్కువగా భూసమస్యలు, రేషన్‌కార్డుల సమస్య, ఉపాధి కల్పించాలని, పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై ఆయా మండలాల అధికారులతో వీసీ ద్వారా మాట్లాడారు. సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయికెళ్లి వాస్తవ పరిష్కారం చూపడం ద్వారా అధికారులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. డీఆర్వో రవికుమార్, జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, డీఆర్డీఓ నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఎస్‌హెచ్‌ఓపై చర్యలు తీసుకోవాలి



చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్న భూత్పూర్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీదేవి, నాగభూషణం, విజయ్ ఆధ్వర్యంలో బాధితులు గడ్డమీది రాములు, భద్రమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మద్దిగట్లలో దళిత కాలనీలో ఓ వ్యక్తి క్యాటిల్ షెడ్ నడుపుతూ వ్యర్థాలను దళితుల బావిలోకి వదులుతున్నారని, బావిలోని నీళ్లు కంపు వాసన కొడుతున్నాయని పేర్కొన్నారు. క్యాటిల్‌షెడ్ తరలించాలని కోరగా కొందరు వ్యక్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సంబంధం లేని సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం హౌస్‌ఆఫీసర్‌కు తగదని, ఆయన చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల వేతనాలు విడుదల చేయాలి



పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలను విడుదల చేసి ఆదుకోవాలి. మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ మండలాల్లోని ఆయా పంచాయతీల్లో 8 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు లేక కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు సాంబశివుడు, నాగన్న, వెంకట్రాములు, బాలక్రిష్ణయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి విన్నవించారు.

ఆరని నిప్పు

వేసవిలో తరుచుగా అగ్నికీలల్లో అటవీ సంపద

- ఏటా అగ్నికి ఆహుతవుతున్న నల్లమల అభయారణ్యం
- ప్రశ్నార్థకంగా మారుతున్న జీవవైవిధ్యం
- నెలరోజుల వ్యవధిలో 11 సార్లు కార్చిచ్చు
- పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోతున్న యంత్రాంగం



రాంపూర్ పెంటలో మంటలు ఆర్పుతున్న అటవీ సిబ్బంది (ఫైల్)

అచ్చంపేట: ఆకులు రాలే కాలానికి పెరుగుతున్న ఉష్ణోగ్రతలు తోడవడంతో నల్లమల అటవీ ప్రాంతం భగ్గుమంటోంది. 15 రోజుల వ్యవధిలో ఐదు, ఆరుసార్లు చోటుచేసుకున్న అగ్నిప్రమాదాలతో సుమారు 200 హెక్టార్లకు పైగా అడవి కాలినట్లు అధికారుల ప్రాథమిక అంచనా వేశారు. ప్రతిఏటా వేసవిలో ఈ తంతు పరిపాటిగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయం అటు అధికారులు.. ఇటు పర్యావరణ ప్రేమికుల్లో నెలకొంది. ఎండుటాకులు, గడ్డి, తగలబడుతోంది. ఎక్కడ చిన్న అగ్గి రాజుకున్నా అడివంతా విస్తరిస్తోంది. రాత్రి సమయాల్లో చూస్తే గుట్టలపై దీపాల వరుసల్లా మంటలు కనిపిస్తున్నాయి. ఎస్ఎన్‌పీపీ, మోడీస్ ఉపగ్రహాల ద్వారా ప్రమాదాల సమాచారం అందుకుంటున్న అటవీశాఖ అప్రమత్తమై వెంటనే మంటల్ని ఆర్పేందుకు సిబ్బందిని రంగంలోకి దింపుతుంది.

కారణాలు ఇవేనా?

ఉమ్మడి జిల్లాలో మొత్తం 7.73 లక్షల ఎకరాల్లో అటవీ భూమి విస్తరించి ఉంది. కేవలం నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని నల్లమల ప్రాంతమే 6.17 లక్షల ఎకరాలు. నల్లమల అటవీ గుండా వెళ్తున్న హైదరాబాద్–శ్రీశైలం, మన్ననూర్– మద్దిమడుగు రహదారుల వెంట యాత్రికులు, గొర్రెల కాపరులు రాజేస్తున్న నిప్పు ప్రమాదాలకు దారి తీసి వన్యప్రాణులకు ముప్పుగా మారుతోంది. మానవ నిర్లక్ష్యమో.. లేదా మరేదైనా కారణంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంటే అడవిలోని ఏళ్లనాటి చెట్లు, అమూల్యమైన ఔషధ మొక్కలు కాలి బూడిద కావడంతో పాటు వన్యప్రాణులు సైతం మంటల్లో చిక్కుకుని మరణిస్తున్నాయి. అడవి జంతువులు పరుగెత్తితే రాళ్లకు రాళ్లు తగిలి మంటలు వ్యాపిస్తాయి. అలాగే నారేప, దేవదారు, నల్లమద్ది వంటి గట్టి చెట్లు చెట్టుకు చెట్టు తాకడం వల్ల కూడా మంటలు వచ్చే అవకాశం ఉంది. నల్లమల ప్రాంతంలో జరిగే అగ్నిప్రమాదాలు ఎక్కువగా కార్చిచ్చు వల్లనే జరుగుతున్నాయనేది ఒక అంచనా.

అటవీశాఖ చర్యలిలా..

అడవి పరిసరాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఫైర్‌లైన్లు, వాచ్‌టవర్లు, ఎయిర్ బోయర్లు, తక్షణ స్పందన బృందా (క్విక్ రెస్పాన్స్ టీం)లను ఏర్పాటు చేసింది. అధికారులు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు సహా దాదాపు 10 వేల మంది ఫోన్ నంబర్లను అటవీ శాఖ రిజిస్టర్ చేసి, ఉపగ్రహాల నుంచి వచ్చే అగ్ని ప్రమాదాల సమాచారం వీరందరికీ ఎప్పటికప్పుడు అందిస్తోంది.

- అగ్ని ప్రమాదాల ప్రాంతాలను ఉపగ్రహాల ద్వారా గుర్తించాలి. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల నివారించవచ్చు.
- ఫైర్ వాచర్లకు వాహనాలు, మంటలు ఆర్పే పరికరాలను అందించడం.
- ఫైర్‌లైన్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించడం, వాచ్ టవర్ల సంఖ్య పెంచడం.
- వేసవిలో తాత్కాలిక పద్ధతిలో ఫైర్ వాచర్లను నియమించుకుని పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం

నల్లమలలో మంటలు వ్యాపించడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వారం రోజుల క్రితం తుర్కపల్లి సెక్షన్‌లో రెండు, ఉప్పునుంతల సెక్షన్ తూనికమాన్‌పేట బీట్‌లో కార్చిచ్చు ఏర్పడింది. 3–4 హెక్టార్లలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మూడు ఫైర్ టీంలు ద్వారా మంటలు ఆర్పాం. నిప్పు పెట్టడం వల్ల అడవి కాలుతోంది. గొర్రెలు, మేకలు, పశువులు మేపడం కోసం అడవిలోకి వెళ్లేవారికి అవగాహన కల్పిస్తున్నాం.

– ఆదిత్య, ఎఫ్ఆర్ఓ, అమ్రాబాద్

నల్లబడుతున్న నల్లమల

- అగ్ని ప్రమాదాలతో అడవి నల్లగా మాడిపోతోంది. మన్ననూర్ నుంచి దోమలపెంట వరకు 55 కి.మీ., పొడవునా అగ్ని ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.
- ఈ ఏడాది జనవరి 20న మన్ననూర్– వటువర్లపల్లి–దోమలపెంట వరకు రహదారికి ఇరువైపులా అనేక చోట్ల అడవి కాలిపోయింది. జనవరి 30న పల్లెబైలు, కొమ్మనపెంట సమీపంలో 5 హెక్టార్లు కాలిపోయింది.
- ఈ నెల 1న దోమలపెంట రేంజ్ పరిధిలోని బోరెడ్డిపల్లిబావి సమీపంలో 2 హెక్టార్ల మేర అడవి కాలింది. ఈ మంటలకు కుమార్ అనే వ్యక్తి కారణంగా భావించి కేసు నమోదు చేశారు.
- ఈ నెల 17న అమ్రాబాద్ రేంజ్‌లోని తుర్కపల్లి బీట్‌లో రెండు, ఉప్పునుంతల బీట్‌లోని తూనికమాన్‌పేట వద్ద కార్చిచ్చు ఏర్పడింది. 3 నుంచి 4హెక్టార్లలో అడవి కాలింది.
- ఈ నెల 17, 18 తేదీల్లో దోమలపెంట రేంజ్‌ల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి, తాంటిగుండాలు, వజ్రాలమడుగు కృష్ణా రివర్ వరకు 50 నుంచి 70 హెక్టార్ల విస్తీర్ణంలో మంటలు వ్యాపించాయి.
- ఈ నెల 19న లోతట్టు అటవీ ప్రాంతమైన ఈర్లపెంట సమీపంలో అడవికి నిప్పు అంటుకుంది. చెలరేగిన మంటలు ఆర్పే అవకాశం లేనందున మంటలు విస్తరించి ఉడుతనూరి బంగారి, ఉడతనూరి శివ, కంత్రాజు పోషన్న గుడిసెలు అంటుకుని వంట సామగ్రి, తిండిగింజలు కాలిపోయాయి.
- ఈ నెల 20న రాంపూర్ సెక్షన్ వేములపాయ బీట్‌లో కార్చిచ్చు రగలగా క్విక్ రెస్పాండ్ టీం, బేస్ క్యాంపు వాచర్లు మంటలు అదుపులోకి తెచ్చారు. అలాగే కొల్లాపూర్ అటవీ ప్రాంతంలో మినుముట్, అంకిల్‌పేట ఏరియాలో మంటలు ఏర్పడటంతో వాచర్లు అప్రమత్తమై అదుపులోకి తెచ్చారు.
- ఈ నెల 21న పర్హాబాద్, రాంపూర్, భౌరాపూర్ సెక్షన్‌లో 8 హెక్టార్లలో మంటలు చెలరేగడంతో అటవీ శాఖకు చెందిన 15 మంది ఫైర్ వాచర్లు, 15 మంది బేస్ క్యాంపు సిబ్బంది 4 గంటల పాటు శ్రమించి మంటలు అదుపులోకి తెచ్చారు.
- ఈ నెల 22న మన్ననూర్ రేంజ్ పరిధిలోని రాంపూర్, భౌరాపూర్, పుల్లాయిపల్లి బేస్ క్యాంపు పరిధిలో 4 హెక్టార్లలో అడవి కాలింది.

నల్లమల అడవి వివరాలు	నల్లమల అటవీ విస్తీర్ణం	అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధి	బఫర్ జోన్	రిజర్వు ఫారెస్టు ఏరియా	మొత్తం అటవీ బ్లాకులు
	2,496 చ.కి.మీ.,	1,750 చ.కి.మీ.,	445.03 చ.కి.మీ.,	301 చ.కి.మీ.,	25

క్లుప్తంగా

చేపలవేటకు వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: చేపలవేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉయ్యాలవాడకి చెందిన కుర్మయ్య(46) ఆదివారం గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. సోమవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి


మృతి చెందిన స్వామి

లింగాల: రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని పద్మన్నపల్లి గ్రామ పంచాయతీలో నేనావత్ స్వామి(47) పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పంచాయతీ పని నిమిత్తం స్వామి బైక్‌పై గ్రామం నుంచి మండల కేంద్రానికి బయలుదేరాడు. మండల కేంద్రంలోని ఎస్సీ వాడ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శంకరమ్మ ఎనిమిది నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నూర్పిడి యంత్రంలో పడి మహిళ దుర్మరణం


నూర్పిడి యంత్రంలో పడి మృతి చెందిన జ్యోతి

జడ్చర్ల: వేరుశనగ నూర్పిడియంత్రంలో పడి ఓ మహిళా రైతు దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని చిన్న ఆదిరాల గ్రామ శివారులో చోటు చేసుకుంది. చిన్న ఆదిరాలకి చెందిన వడ్ల జ్యోతి(50) తన వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటను సాగు చేసింది. వేరుశనగ పంట దిగుబడికి సంబంధించి నూర్పిడి చేసేందుకు యంత్రాన్ని అద్దెకు తీసుకువచ్చింది. తానే స్వయంగా వేరుశనగ పంటను యంత్రంలో వేసి నూర్పిడి చేసే పనులలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ఆమె చీర కొంగు నూర్పిడి చక్రాలకు చుట్టుకోవడంతో ఆమె ప్రమాదవశాత్తు యంత్రంలో పడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మృతురాలి భర్త వడ్ల పాండయ్య కూడా నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

బల్మూర్ వ్యవసాయ మార్కెట్ గోదాంలో వరి ధాన్యం చోరీ

బల్మూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ గోదాంలో రైస్ మిల్లు యజమాని భద్రపరిచిన వరి ధాన్యం చోరీకి గురైనట్లు ఎస్‌ఐ బాలరాజు సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేటలోని శ్రీలక్ష్మి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు వారికి గతేడాది మే నెలలో సీఎమ్మార్ రైస్ కోసం వ్యవసాయశాఖ ఇచ్చిన వరి ధాన్యం బల్మూర్‌లోని గోదాల్ రహదారిలోని ఏఎంసీ గోదాంలో 52 వేల బస్తాల వరి ధాన్యాన్ని రైస్ మిల్ యజమాని వెంకటేష్ భద్రపరిచారు. ఏఎంసీ నిబంధనల ప్రకారం గోదాం అద్దె కూడా చెల్లిస్తున్నాడు. సోమవారం గోదాంకు వచ్చిన రైస్‌మిల్లు యజమాని గోదాం షెట్టర్ల తాళాలు విరగొట్టి ఉన్నాయి. షట్టర్ తెరిచి చూడగా తాను భద్రపరిచిన వరి ధాన్యం సుమారు 2వేల బస్తాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు బాధతుడి ఫిర్యాదు మేరకు గోదాంను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి దర్యాప్తు చేయనున్నట్లు వివరించారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. సోమవారం 1,016 అడుగులకు చేరింది. కొత్తపల్లి ఊకచెట్టు వాగు వంతెన కింద నీటి మట్టం తగ్గింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

రైల్వేస్టేషన్లకు ఆధునిక హంగులు


గద్వాలలో శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు


మహబూబ్‌నగర్ శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, డీకే అరుణ

- జడ్చర్ల, గద్వాలకు రూ.20.43 కోట్లు కేటాయింపు
- 'అమృత్ భారత్' పనులను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- హాజరైన ఎంపీలు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పోతుగంటి రాములు
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

జడ్చర్ల టౌన్/ గద్వాల అర్బన్: ఉమ్మడి జిల్లాలోని జడ్చర్ల, రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా జడ్చర్ల రూ.10.94 కోట్లు, గద్వాల రైల్వేస్టేషన్‌ను రూ.9.49 కోట్లతో ఆధునీకరించనున్నారు. ఈ క్రమంలో జడ్చర్ల స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి డీకే అరుణ తదితరులు హాజరై ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని టీవీ, బిగ్ స్క్రీన్లలో వీక్షించారు. అనంతరం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో పారదర్శక పాలన కొనసాగుతుందన్నారు. మోదీ లాంటి వ్యక్తి ప్రధానిగా ఉండటం మనందరికీ గర్వకారణం అన్నారు. రైల్వే రంగంలో ఎన్నో సంస్కరణలు చేపట్టారని, ఫలితంగా వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మోదీ తెలంగాణపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టారని, గడిచిన పదేళ్లలో రైల్వేలో రాష్ట్రానికి దాదాపు రూ.5,071 కోట్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజలందరికీ మంచి చేస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ దేశంలో సామాన్య ప్రజలు అత్యధికంగా ప్రయాణించే వాటిలో రైలు మార్గం ఒకటి అన్నారు. తక్కువ టికెట్ ధరలతో పేదలందరికీ అనుకూలంగా రైలు మార్గం ఉందన్నారు. అలాంటి రైల్వేను తమ ప్రభుత్వ హయాంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి మంచి గుర్తింపు తీసుకురావడం జరిగిందన్నారు. నిన్నటి వరకు ప్రపంచంలో విమానాశ్రయాలకే మంచి గుర్తింపు ఉండేదని, ఇప్పుడు రైల్వేలోనూ అనేక అభివృద్ధి పనులు చేసి గుర్తింపు తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా చోట్ల ఎంపీలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ సారిక, దక్షిణమధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డీఎంఈ అహ్మద్, ఏసీఎం భాగ్య, రైల్వేస్టేషన్ మాస్టర్లు ముఖేష్ అహ్మద్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కృష్ణా స్టేషన్‌లో రైళ్లు ఆపాలి


కృష్ణాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కృష్ణా: ఇక్కడి రైల్వేస్టేషన్ నుంచి వెళ్లే ప్రతి రైలును ఇక్కడ ఆపాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. అంతకు ముందు అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కృష్ణా స్టేషన్ అతి పురాతనమైందని, ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే ఈ స్టేషన్ పెద్దది అన్నారు. ఈ స్టేషన్ నుంచి ప్రతిరోజు 36 రైళ్ల రాకపోకలు సాగిస్తాయని, వాటన్నింటినీ ఇక్కడ ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చేగుంట రైల్వేస్టేషన్ పరిధిలోని ఐనాపూర్ వెళ్లే దారిలో సీసీరోడ్డు వేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అనంతరం రైల్వే శాఖ అధికారులు స్థానిక విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, ప్రజాప్రతినిధులు మహదేవ్, సురేష్, సద్దాం హుసేన్, కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రావు, ఆనంద్‌గౌడ్, గుండప్ప, రైల్వే అధికారులు ఏడీఈఎన్ శ్రీధర్‌బాబు, గోపాల్, విజయకుమార్‌రెడ్డి, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడాలి

గద్వాల రైల్వేస్టేషన్ రూపురేఖలు మార్చి ప్రయాణికులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమవంతు కృషిచేస్తానని, రైల్వే అధికారులు సైతం చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీ రాములు అన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మధ్య ఉన్న గద్వాల ప్రాంతం అత్యంత ప్రాధాన్యం, పురాతన, సంస్కృతి కలిగి ఉందన్నారు. గద్వాల రైల్వేస్టేషన్ పరిధిలో దాదాపు 100 ఎకరాల భూమి ఉందని, దీని అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరుతానన్నారు. రైల్వేస్టేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రధాని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో గద్వాల రైల్వేస్టేషన్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కొత్తగా స్టేషన్‌లో 20 రైళ్లు ఆగుతున్నాయని, ఫలితంగా ఇక్కడి ప్రజలు హైదరాబాద్, ఢిల్లీ వంటి మహానగరాలకు ప్రయాణిస్తున్నారన్నారు. అయిదేళ్లుగా రాయిచూర్‌కు రైలు నడుస్తోందని, డబ్లింగ్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. గద్వాలలో మరిన్ని రైళ్లు ఆపాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే డివిజనల్ అధికారి అరుణ్‌కుమార్‌శర్మ మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంలో రైల్వేస్టేషన్‌లో ప్రధాన ద్వారం, ప్రయాణ ప్రాంగణం, స్టేషన్ లోపల, పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం, వెయిటింగ్ హాల్, టాయిలెట్స్, లిఫ్టులు, వన్ ప్రాడక్ట్ దుకాణాలు, మెరుగైన లైటింగ్, అప్‌గ్రేడ్ పార్కింగ్, దివ్యాంగులకు అనుకూలమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అదేవిధంగా వికసిత్ భారత్–వికసిత్ రైల్వే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ కేశవ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి


మాట్లాడుతున్న జ్యోతి

గద్వాల అర్బన్: భువనగిరి సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థినులు భవ్య, వైష్ణవి మరణాలపై సమగ్ర విచారణ చేయాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భవ్య, వైష్ణవి మరణాలపై అనేక అనుమానాలున్నాయని, దీనిపై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయాలని, వార్డెన్, ఆటో డ్రైవర్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లను పర్యవేక్షించి మెరుగైన వసతులు కల్పించాలని, సొంత భవనాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో చైతన్య మహిళా సంఘం గద్వాల కన్వీనర్ రేవతి, కో కన్వీనర్ జయమ్మ, సభ్యులు జయమ్మ, భారతి, వెంకటమ్మ, గోవిందమ్మ, మహేశ్వరి ఉన్నారు.

ఏకలవ్య మోడల్‌స్కూళ్లలో అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్టీ గురుకులాల ఆర్సీఓ నాగార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో వచ్చే నెల 23 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో ఏకలవ్య పాఠశాలలు బాలానగర్, కల్వకుర్తిలో ఉన్నాయని, ఏప్రిల్ 21న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 9490957312, 9490957313 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

సోమేశ్వరుడిని దర్శించుకున్న పురావస్తు శాఖ డైరెక్టర్


సమస్యల గురించి తెలుసుకుంటున్న డైరెక్టర్ భారతి హోలికేరి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో వెలసిన లలిత సోమేశ్వరస్వామి ఆలయాన్ని పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోలికేరి సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన డైరెక్టర్‌కు ఆలయ కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె కమిటీ నిర్వాహకులతో ఆలయానికి వచ్చే భక్తులకు కల్పించాల్సిన వసతులు, సౌకర్యాల గురించి ఆరాతీశారు. తక్షణం చేపట్టాల్సిన పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి నిధులు మంజూరు చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఆలయాన్ని సందర్శించినట్లు వివరించారు. అనంతరం అక్కడే ఉన్న మ్యూజియంను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

జిల్లా కవులకు పురస్కారాలు


భీంపల్లి శ్రీకాంత్‌కు పురస్కారం అందజేస్తున్న స్పీకర్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన ప్రముఖ కవులు, పరిశోధకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, డాక్టర్ వెల్దండ వెంకటేశ్వరరావులకు జాతీయ ఎక్సలెన్సీ పురస్కారాలు లభించాయి. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అతిథి జాతీయ మాసపత్రిక దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా, డీఎస్ రెడ్డి, ప్రొ. పాపిరెడ్డి, అతిథి జాతీయ మాసపత్రిక సంపాదకులు మద్దాలి వెంకటేశ్వరరావు, హరికృష్ణ, బాలాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్ 14 రాష్ట్ర క్రికెట్ టోర్నీ ప్రారంభం


టోర్నీ ప్రారంభిస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య

జడ్చర్ల టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మినీస్టేడియం మైదానంలో రాష్ట్రస్థాయి అండర్ 14 బాలుర క్రికెట్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీవైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య టోర్నీని ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి 10 జట్లు టోర్నీకి హాజరయ్యాయి. కార్యక్రమంలో ఎంఈఓ మంజులా దేవి, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

తొలి మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ విజయం

తొలి మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు ప్రతిభ కనబర్చి విజయం సాధించింది. ఆతిథ్య మహబూబ్‌నగర్, వరంగల్ జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్‌లో నిర్ణీత 15 ఓవర్లలో ఆతిథ్య జట్టు 152 పరుగులు చేసింది. జట్టులో కేతన్‌కుమార్ యాదవ్ 54 బంతుల్లో 85 పరుగులు చేశాడు. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వరంగల్ జట్టు కేవలం 85 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ తరువాత జరిగిన మ్యాచ్‌లో నల్లగొండ, నిజామాబాద్ జట్లలో నల్లగొండ విజయం సాధించింది. హైదరాబాద్, వరంగల్ మ్యాచ్‌లో హైదరాబాద్, కరీంనగర్ ఖమ్మం మ్యాచ్‌లో ఖమ్మం, రంగారెడ్డి, మెదక్ జట్ల మధ్య రంగారెడ్డి, ఖమ్మం, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లో ఖమ్మం విజయం సాధించింది. వరంగల్ రెండు మ్యాచ్‌లలో ఓటమిపాలవగా.. ఖమ్మం రెండు మ్యాచ్‌లలో విజయం సాధించింది.


హైదరాబాద్ వరంగల్ జట్ల మధ్య మ్యాచ్

అయోధ్యకు చేరిన తండ్రి కొడుకుల సైకిల్ యాత్ర



మక్తల్: పట్టణంలోని బసవేశ్వర కాలనీకి చెందిన పాలమూరు నాగప్ప, కుమారుడు నరేందర్ చేపట్టిన సైకిల్ యాత్ర అయోధ్యకు చేరుకుంది. వీరు ఈ నెల 9న మక్తల్ నుంచి హైదరాబాద్ వెళ్లి.. 14న ఎలక్ట్రికల్ సైకిల్‌పై అయోధ్యకు బయలుదేరారు. 12 రోజులపాటు కొనసాగిన వీరి యాత్ర సోమవారం అయోధ్యకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీరాముడిని దర్శించుకొని పూజలు చేసి మొక్కుల చెల్లించుకున్నారు. మక్తల్ నుంచి అయోధ్యకు వెళ్లిన తండ్రీకొడుకులను పలువురు అభినందించారు.

కల్తీ డీజిల్ పోశారని వాగ్వాదం

నాగర్‌కర్నూల్ క్రైం: వాహనంలో కల్తీ డీజిల్ పోశారని పెట్రోల్ బంక్‌లో వాగ్వాదం దిగిన ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో ఉన్న ఓ పెట్రోల్‌బంక్‌లో జిల్లా కేంద్రానికి చెందిన బోర్‌వెల్స్ యజమాని తన వాహనంలో డీజిల్ పోయించుకుని కొద్ది దూరం వెళ్లే సరికి ఆగిపోయింది. డీజిల్ ట్యాంక్‌ను పరిశీలిస్తే అందులో నీరు ఉండటంతో వాహనదారుడు పెట్రోల్ బంక్‌లో గొడవకు దిగాడు. అక్కడే ఉన్న వాహనదారులు సైతం వాగ్వాదానికి దిగారు. కల్తీ డీజిల్ పోసిన బంక్‌పై చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేశారు.

అణచివేయాలనే కుట్రతోనే దాడి


మాట్లాడుతున్న ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్

గద్వాల అర్బన్: జన్వాడలో క్రైస్తవులపై పాశావికంగా దాడులు జరిగినా అసెంబ్లీలో మాట్లాడకపోవడం, కనీసం తీర్మానం ప్రవేశపెట్టకపోవడం సిగ్గుచేటని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జమ్మిచేడులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 'రాజ్యాంగాన్ని రక్షించాలి.. జన్వాడ దోషులను శిక్షించాలి' అంశంపై నడిగడ్డ క్రైస్తవుల నిరసన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక వర్గాన్ని అణివేయాలనే కుట్రతోనే దాడి చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్య, లౌకిక దేశంలో కుల, మతపరమైన దాడులు క్షమించరాని నేరమన్నారు. జన్వాడలో క్రైస్తవులపై దాడి జరిగి 18గంటలైనా పోలీసులు నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడడంలో పోలీసులు విఫలమయ్యారని చెప్పారు. క్రైస్తవులపై దాడి జరిగితే ఏ పార్టీ కూడా ఖండించలేదని, కనీసం అసెంబ్లీలో మాట్లాడలేదన్నారు. క్రైస్తవులు ఓట్లేయలేదా? అని నిలదీశారు. జన్వాడలో క్రైస్తవులపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో మైనార్టీలకు రక్షణ కల్పించాలన్నారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కేశవరావు, అతిఖుర్ రహ్మాన్, మణికుమార్, గోపాల్ రెడ్డి, ముని, తిమ్మప్ప, మహేష్, సుదర్శనం, అబ్రహం తదితరులు ఉన్నారు.

రైతుబంధు నిధుల మళ్లింపుపై విచారణ

గట్టు: రైతుబంధు నిధుల మళ్లింపుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సోమవారం విచారణ అధికారి జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ విజయగౌరి గద్వాల వ్యవసాయ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. బల్గెర గ్రామానికి చెందిన 64 మంది రైతులకు సంబంధించి రూ.36 లక్షల రైతుబంధు నిధులను బినామీ ఖాతాలకు మళ్లించిన వ్యవహారంపై ఇప్పటికే సంబంధిత ఏఈఓ దివ్యను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రైతుబంధు నిధుల మళ్లింపునకు సంబంధించిన పత్రాలను జేడీఏ పరిశీలించారు. అధికారుల నివేదిక, రైతుల వివరాలను సేకరించారు. పూర్తి వివరాల కోసం క్షేత్రస్థాయిలో విచారణ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్


వర్కూర్ సమీపంలో సీజ్ చేసిన ఇసుక

మాగనూర్: మండలంలోని వర్కూర్ సమీపంలో ఇసుక నిల్వను సీజ్ చేసినట్లు ఆర్ఐ శ్రీశైలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వర్కూర్ పెద్ద వాగు నుంచి అనుమతులు లేకుండా సోమవారం ఉదయం ఇసుక తరలించి సమీపంలో నిల్వ చేసినట్లు గ్రామస్తుల ఫిర్యాదు చేశారు. అనుమతులు లేని ఇసుక నిల్వ ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని, నిర్మాణానికి మాత్రమే ఇసుకను ప్రభుత్వ అనుమతుల ద్వారా తరలించుకోవాలని సూచించారు. డంపు చేసిన ఇసుకను ప్రభుత్వ పనుల నిమిత్తం వినియోగిస్తామని వెల్లడించారు.

చిన్నారిని బలితీసుకున్న కుటుంబ కలహాలు

- ఇద్దరు పిల్లలతో కలిసి నీటి గుంతలో దూకిన మహిళ
- రెండేళ్ల బాలుడు మృతి.. మరో చిన్నారి పరిస్థితి విషమం
- క్షేమంగా బయటపడిన తల్లి.. రామకిష్టాయపల్లిలో ఘటన


చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ధన్వాడ: భార్యాభర్తల మధ్య చోటుచేసుకున్న కలహాలు ఓ బాలుడిని బలి తీసుకోగా.. మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని రామకిష్టాయపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డికి మూడేళ్ల క్రితం కొండ్రోన్‌పల్లికి చెందిన వరలక్ష్మి(22)తో కులాంతర వివాహం జరిగింది. వీరికి కార్తిక్(2), మరో చిన్నారి (6 నెలలు) ఉన్నారు. అయితే సోమవారం ఇంట్లో గొడవ జరగడంతో వరలక్ష్మి పిల్లలను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో కొండ్రోన్‌పల్లికి వెళ్లే అడ్డదారిలో పొలం వద్ద ఉన్న చిన్న గుంతలో ముందుగా రెండేళ్ల బాలుడు కార్తిక్‌ను నీటిలో తోసేసింది. అనంతరం ఆమెనే బాలుడిని బయటకు పడేసి ఆరు నెలల చిన్నారితో కలిసి గుంతలో దూకింది. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఓ రైతు గమనించి వెంటనే అక్కడికి వచ్చి వారిని బయటకు తీశారు. అనంతరం గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు వచ్చి 108కు ఇచ్చారు. 108లో ధన్వాడ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు నారాయణపేట జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికి వెళ్లగా కార్తిక్ మృతిచెందగా మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. తల్లి పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉంది. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాగునీటి సమస్య రావొద్దు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్, జిల్లా అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన పూర్తిస్థాయి కార్యాచరణ రూపొందించామన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో తాగునీటి వనరులు, నీటి సరఫరాపై హ్యాబిటేషన్ వారిగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బోర్‌వెల్ ఫ్లషింగ్, డీపెనింగ్, మోటార్ల రిపేర్లు, పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా మరమ్మతులు చేపట్టాలని అన్నారు. మండలంలోని అందరూ అధికారులు సమన్వయంతో పనిచేసి వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఓహెచ్‌ఎస్‌ఆర్‌లకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా చేపట్టాలన్నారు.

నేటి చేవెళ్ల సీఎం సభకు ప్రత్యేక బస్సులు..

చేవెళ్లలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు రూ.500 సిలిండర్, 200 యూనిట్లకు ఉచిత కరెంట్ పథకాలను ప్రారంభించనున్నందున జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి మహిళలు తరలివెళ్లేందుకు నియోజకవర్గాల వారీగా 13 బస్సులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు స్వయం సహాయక సంఘాల మహిళలను ఉదయం 9 గంటలకు తీసుకెళ్లి, మళ్లీ జాగ్రత్తగా తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి..

జిల్లాలోని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు సమయపాలన పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. బయోమెట్రిక్ హాజరుపై శాఖల వారీగా సమీక్షించిన అనంతరం మాట్లాడుతూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదన్నారు. కార్యాలయాలకు ఆలస్యంగా వస్తున్న ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, డీఆర్డీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి..

ఆర్థిక అక్షరాస్యత అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సోమవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు సేవలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డిజిటల్ లావాదేవీలు,, సమస్యలు అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలపై వివరించాలన్నారు. ఈ నెల 27న జిలా్ల కేంద్రంలో 2కే వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ బంగ్లా దగ్గర ఉన్న ఎస్సీ హాస్టల్ నుంచి ఉదయం 6:30 గంటలకు వాక్ ప్రారంభమవుతుందని తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం..

ఓ హత్య కేసులో సంబంధం లేకుండా జీవిత ఖైదు అనుభవించి నిర్దోషిగా బయటకు వచ్చిన వ్యక్తికి ఆర్థికసాయం అందజేశారు. జడ్చర్ల మండలం ఉదండపూర్ చెందిన లక్ష్మీపతి హైదరాబాద్‌కు వలస వెళ్లిన చోట ఓ సంబంధం లేని హత్య కేసులో ఏడేళ్ల శిక్షను అనుభవించాడు. హైకోర్టు తీర్పుతో శిక్షను రద్దుచేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన ఆర్థిక, అనారోగ్య కారణాలతో వినతిపత్రం సమర్పించగా స్పందించిన కలెక్టర్ తన నిధుల నుంచి కిరాణ షాప్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందజేశారు.

బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం


సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న జోగుళాంబ ఆలయ సిబ్బంది

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయంలో మార్చి 8న నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి, మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం అందించారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ పురేందర్, ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. అలంపూర్ ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, సీఎంకి విన్నవించడంతో సీఎం సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రయ్యాచారి, దేవస్థానం సిబ్బంది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు రూ.10.37 లక్షల ఆస్తిపన్ను వసూలు

- బకాయిలు చెల్లించని 2 దుకాణాల సీజ్
- మున్సిపల్ అధికారుల మెరుపు దాడి


వెంకటేశ్వరకాలనీని తేజ శానిటరీ గోదాంను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని దుకాణదారులపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం ఏఎంసీ జె.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వివిధ షాపుల వద్దకు వెళ్లి ఆస్తిపన్ను వసూలు చేశారు. ఒకేరోజు ఏకంగా 133 మంది నుంచి రూ.10,36,964 రాబట్టారు. కాగా, వెంకటేశ్వరకాలనీలోని తేజ శానిటరీ గోదాం యజమాని నుంచి రెండేళ్లకు సంబంధించి సుమారు రూ.74 వేలు రావాల్సి ఉంది. ఇప్పటికీ చెల్లించకపోవడంతో తాజాగా దానిని సీజ్ చేశారు. అలాగే ఇదే ప్రాంతంలోని రోమన్‌సియా రెస్టారెంట్ నుంచి రూ.1,18,664 రావాల్సి ఉంది. దీనికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది వచ్చి తాళం వేయడంతో దాని యజమాని వాగ్వాదానికి దిగారు. చివరకు జరిమానాతో కలిపి రూ.1.21 లక్షలకు చెక్కు ఇవ్వడంతో సీల్‌ను తొలగించారు. కమలా నెహ్రూకాలనీలోని ప్రతిభ జూనియర్ కళాశాల నుంచి రూ.1,75,713 ఆస్తిపన్ను వసూలు చేశారు. ఇదిలాఉండగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి బకాయిలు కలుపుకొనిఈ ఏడాది మొత్తం రూ.43 కోట్ల పైచిలుకు ఆస్తిపన్ను రావాల్సి ఉంది. ఇప్పటివరకు సుమారు రూ.13 కోట్లు మాత్రమే వసూలైంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం నెల రోజులు మిగిలి ఉంది. గడువులోగా అందరూ ఆస్తిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి పాటుపడాలని ఏఎంసీ పవన్‌కుమార్ విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే మున్సిపల్ చట్టం–2019 ప్రకారం బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

‘ఎల్‌ఆర్‌ఎస్’ ఇక వేగవంతం

- హెచ్‌ఎండీఏ పరిశీలనలో 3.44 లక్షల దరఖాస్తులు
- ప్రభుత్వానికి సుమారు రూ.1000 కోట్లకు పైగా ఆదాయం
- దరఖాస్తుల పరిష్కారం కోసం 2020 నుంచి ఎదురుచూపులు
- సత్వర పరిష్కారం దిశగా హెచ్‌ఎండీఏ కార్యాచరణ



సాక్షి, సిటీబ్యూరో: అక్రమ స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం దిశగా హెచ్‌ఎండీఏ కార్యాచరణను వేగవంతం చేసింది. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశించిన నేపథ్యంలో హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం సీరియస్‌గా దృష్టి సారించింది. లే అవుట్‌ల క్రమబద్ధీకరణ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న సుమారు 3.44 లక్షలకు పైగా దరఖాస్తులను పరిష్కరించేందుకు ఎన్నికలకు ముందే ప్రణాళికలను సిద్ధం చేశారు. అర్హులైన దరఖాస్తుదారుల్లో కొందరికి డాక్యుమెంట్‌లను సమర్పించేందుకు, ఫీజులు చెల్లించేందుకు నోటీస్‌లు కూడా ఇచ్చారు. కానీ ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ మందగించింది. మరోవైపు సిబ్బంది కొరత వల్ల కూడా ఎల్‌ఆర్‌ఎస్ పథకం అమలు నత్తనడకన సాగింది. ప్రస్తుతం ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను వెల్లడించడంతో వీలైనంత తక్కువ సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫైనల్ ప్రొసీడింగ్స్‌ను అందజేయాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

లక్షల్లో దరఖాస్తులు..

ప్లాట్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం అప్పటి ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో హెచ్‌ఎండీఏ పరిధిలోని వివిధ జోన్‌లలో లక్షల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. రూ.1000 దరఖాస్తు రుసుము చెల్లించి చాలా మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించారు. వీటిని పరిశీలించి ప్రొసీడింగ్‌లను ఇచ్చేందుకు అప్పట్లో ప్రభుత్వం కలెక్టర్‌లకు బాధ్యతలను అప్పగించింది. ఈ క్రమంలోనే కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. దరఖాస్తుదారుల వివరాలన్నింటిని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సేకరించి నిక్షిప్తం చేసింది.ఇలా పెండింగ్ జాబితాలో పడిన ఎల్‌ఆర్‌ఎస్‌లను పరిశీలించి అనుమతులను ఇవ్వాలని గత ప్రభుత్వం హయాంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల రూపంలో ఆదాయ సముపార్జనే లక్ష్యంగా మొదట్లో భారీ లే అవుట్‌లపైన దృష్టి సారించారు. ఎకరం కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న లే అవుట్‌లలో విక్రయించగా మిగిలిన ప్లాట్‌లకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఇచ్చేందుకు హెచ్‌ఎండీఏకు బాధ్యతలను అప్పగించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.10 వేలు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న లే అవుట్‌ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. దీంతో దరఖాస్తుదారుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. ఒకవైపు ఈ భారీ లే అవుట్‌లకు ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులను ఇస్తూనే ఇళ్ల స్థలాలు, ప్లాట్‌లకు కూడా దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు ఇవ్వాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏలోని శంకర్‌పల్లి, ఘట్కేసర్, మేడ్చల్, శంషాబాద్ జోన్‌ల నుంచి 2020 లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 3,44,726 దరఖాస్తులు అందాయి. ఇవి కాకుండా మున్సిపాటీల పరిధిలో మరో 1.5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అంచనా. వీటిపైన దరఖాస్తుదారులు ఆయా మున్సిపల్ కార్యాలయాల నుంచే ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులను పొందవచ్చు.

హెచ్‌ఎండీఏలో జోన్‌ల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు

జోన్	దరఖాస్తులు	పరిశీలనలో ఉన్నవి
శంకర్‌పల్లి	73,915	12,193
ఘట్‌కేసర్	1,59,672	14,872
మేడ్చల్	30,850	10,058
శంషాబాద్	80,289	12,902
మొత్తం	3,44,726	50,025

ఆదాయం రూ.1000 కోట్లకు పైగా...

హెచ్‌ఎండీఏ పరిశీలనలో ఉన్న 3.44 లక్షలకు పైగా దరఖాస్తుల నుంచి ప్రభుత్వానికి ఫీజుల రూపంలో రూ.1000 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రభుత్వాన్ని నిధుల లేమి వెంటాడుతున్న దృష్ట్యా వివిధ మార్గాల్లో ఆదాయ సముపార్జనపైన ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్‌ఎండీఏ నుంచి రూ.1000 కోట్లకు పైగా ఆదాయం రావచ్చునని అంచనా వేస్తుండగా మున్సిపాలిటీల ద్వారా అందజేసే ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులపైన కూడా మరో రూ.500 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉండవచ్చునని అంచనా.

నేటి నుంచి తిక్క వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- 27 నుంచి మార్చి 11 వరకు
- ఉత్సవ విగ్రహ ఊరేగింపుతో ప్రారంభం
- మాస శివరాత్రి రోజు ముగింపు ఉత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన తిక్క వీరేశ్వరస్వామి ఆలయం

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి 14 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఈనెల 27న ఆలయ అర్చకుడి నివాసం నుంచి స్వామివారి ఆలయం వరకు తిక్కవీరేశ్వర స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహిస్తారు. ఊరేగింపులో ఆదివాసి కళాకారులతో గుస్సాడి నృత్యం చేస్తారు. 28న ఆలయంలో వేదపండితులతో శాంతిహోమం, 29న అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం ఉంటుంది. మార్చి 1వ తేదీ గుండ్లు, సందపురాళ్లు, ఇసుక సంచులు ఎత్తు పోటీలు నిర్వహించనున్నారు. 2న అంతర్రాష్ట్ర స్థాయి భజన పోటీలు, ఓపెన్ కబడీ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈనెల 3వ తేదీన స్వామివారికి ప్రత్యేక పూజలు, 4న జాతీయ స్థాయి కుస్తీ పోటీలు, 5న ఒంటెద్దు బండి గిరక పోటీలు, 6న అంతర్రాష్ట్ర పొట్టేళ్ల బల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా మార్చి 3 నుంచి 7వ తేదీ వరకు ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 11వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు ముగించనున్నారు.

బాలసదన్ తనిఖీ



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బాలసదన్‌ను సీనియర్ సివిల్‌జడ్జి జి.శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా చిన్నారులకు కల్పిస్తున్న వసతులతో పాటు పలు రికార్డులు, ఆహార ధాన్యాలు, తాగునీరు, శుభ్రత, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. మెనూ వివరాలను తెలుసుకున్నారు. ఆఫీస్ ఆర్డర్స్ ప్రకారం అడ్మిషన్ తీసుకోవడం, తల్లిదండ్రు లకు అప్పగించడంపై ఆరా తీశారు. బియ్యం, సరుకుల నాణ్యతతో పాటు స్టాక్ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. చిన్నారుల బెడ్‌షీట్స్, గదులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జాతీయసైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలమర్రి సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో చిట్టి ప్రయోగాల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి వద్ద ఉన్న సైన్స్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 72 ప్రయోగాలు ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. కార్యక్రమానికి డీఈఓ రవీందర్ హాజరై ప్రయోగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, పిల్లలమర్రి సైన్స్ ఫోరం సభ్యులు పద్మావతి, దేవతి, సాయిబాబు, ఆనంద్, శరత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న ఆర్‌ఎం శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: మేడారాం, గంగాపురం, మన్యంకొండ జాతరల్లో ఆర్టీసీ ఉద్యోగులు నిబద్ధతో, కష్టపడి పనిచేసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం అభినందనీయమని రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం ఉద్యోగస్తుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సందేశాన్ని తెలియజేశారు. ఆర్‌ఎం మాట్లాడుతూ రాబోయే శ్రీశైలం స్పెషల్ ఆపరేషన్స్‌ను ఉద్యోగులు విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలతోపాటు డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కిరాయి ఇళ్లలో కిరికిరి!



- గృహజ్యోతి వెలుగులు కొందరికే!
- హైదరాబాద్‌లో తొమ్మిది సర్కిళ్లు...48,03,963 గృహ కనెక్షన్లు
- 200 యూనిట్లలోపు వాడేవారు 30 లక్షలపైనే
- ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు 19.85 లక్షలు
- రేషన్‌కార్డు ఉన్నవారు 17.21 లక్షల మంది
- ఇప్పటి వరకు రేషన్, ఆధార్ లింకైన కనెక్షన్లు 11 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: గృహజ్యోతి పథకం కిరాయి ఇళ్లలో కొత్త కిరికిరికి కారణమవుతోంది. ఇంటి యజమానికి, అద్దెదారులకు మధ్య వివాదానికి కారణమవుతోంది. అద్దెకు ఉన్నవారు తమ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌ను కరెంట్ కనెక్షన్‌కు అనుసంధానం (మ్యాపింగ్) చేయాల్సిందిగా కోరుతుండగా, ఇందుకు యజమానులు ససేమిరా అంటున్నారు. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు వస్తాయనే భావనతో మెజార్టీ ఇళ్ల యజమానులు ఇందుకు అంగీకరించడంలేదు. ఫలితంగా ఆరు గ్యారెంటీల పథకంలో భాగంగా త్వరలో అమలు చేయబోతున్న గృహజ్యోతి పథకానికి వీరందరికీ అర్హత ఉన్నా..లబ్ధి పొందే అవకాశం లేకుండా పోతోంది. గ్రేటర్ జిల్లాల పరిధిలోని తొమ్మిది సర్కిళ్ల ఉండగా, వీటిలో 48,03,963 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారులు 30 లక్షల మందికిపైగా ఉన్నట్లు అంచనా. అంతేకాదు కొన్ని ఇళ్లలో ఒకే మీటర్ ఉండటం, రెండు, మూడు కుటుంబాలు అద్దెకు ఉండటం కూడా ఇబ్బందిగా మారింది. ఈ అంశంపై ఇటు డిస్కం అధికారులు కానీ, అటు ప్రభుత్వం కానీ స్పష్టత ఇవ్వకపోవడం లబ్ధిదారుల్లో ఆందోళనకు కారణమవుతోంది.

11 లక్షలకు మించలే..

ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా ప్రభుత్వం మంగళవారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించబోతోంది. ఇకపై నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి ఉచిత విద్యుత్ సహా రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేయబోతోంది. ఆయా పథకాలకు రేషన్‌కార్డు/ఆధార్ కార్డు/ఫోన్ నంబర్లను తప్పనిసరి చేసింది. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా మూడు జిల్లాల నుంచి 19.85 లక్షల దరఖాస్తులు గృహజ్యోతి పథకం కింద అందాయి. అయితే వీరిలో 17.21 లక్షల మందికి మాత్రమే రేషన్ కార్డులు ఉన్నాయి. చాలా మందికి రేషన్ కార్డులు లేక పోవడంతో వారంతా తమ కనెక్షన్లను ఈ ఉచిత పథకానికి అనుసంధానం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అంతేకాదు రేషన్‌కార్డు ఉన్నవాళ్లు కిరాయి ఇళ్లలో ఉంటుండటం, ఇంటి యజమానులు వారి వివరాలను డిస్కంకు ఇచ్చేందుకు నిరాకరిస్తుండటంతో వారంతా ఈ పథకానికి నోచుకోలేక పోతున్నారు. ఇదిలా ఉంటే విద్యుత్ కనెక్షన్లకు ఆధార్/రేషన్‌కార్డుల అనుసంధానం ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని డిస్కం ప్రకటించింది. సమీపంలోని ఈఆర్‌ఓ కేంద్రాల్లో కానీ, సెక్షన్ ఆఫీసుల్లో కానీ వీటిని నమోదు చేయించుకోవాలని సూచిస్తుంది.

తొమ్మిది సర్కిళ్ల పరిధిలో అనుసంధానం చేసిన కనెక్షన్లు...

సర్కిల్	గృహ విద్యుత్ కనెక్షన్లు	రేషన్‌కార్డు/ ఆధార్ లింకు చేసినవి
బంజారాహిల్స్	3,12,684	59,014
సైబర్‌సిటీ	5,30,357	94,452
హబ్సిగూడ	7,30,963	1,62,517
సెంట్రల్ సర్కిల్	4,97,825	94,502
సౌత్ సర్కిల్	5,41,453	1,28,031
మేడ్చల్	7,07,909	1,49,322
రాజేంద్రనగర్	4,54,725	1,59,787
సరూర్‌నగర్	6,08,798	1,47,790
సికింద్రాబాద్	4,19,249	93,500

సంస్కృతి, సంప్రదాయలు అలవర్చాలి


మాట్లాడుతున్న విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి

నారాయణపేట: చిన్నప్పటి నుంచే విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయలను అలవర్చాలని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల కేంద్రంగా ప్రీ ప్రైమరీ విద్యార్థుల అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోని నాలుగు శిశు మందిరాల్లో చదువుతున్న ప్రీ ప్రైమరీ విద్యార్థుల అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలు 250 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు పిరికి కథలను చెప్పవద్దని, ధైర్యసాహసాల కథలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో పాలమూరు విభాగ్ అధ్యక్షులు శ్రీనివాసయ్య, ఉపాధ్యక్షులు మద్ది అనంత రెడ్డి పాల్గొన్నారు.


అమ్మమ్మలు, తాతయ్యలు, నాన్నమ్మలకు భోజనం తినిపిస్తున్న చిన్నారులు

లష్కర్ జిల్లా ఏర్పాటుకు ఉద్యమం

- సికింద్రాబాద్‌లో ఆవిర్భవించిన జిల్లా సాధన సమితి
- ప్రత్యేక మున్సిపాలిటీగా ప్రకటించాలని డిమాండ్


సికింద్రాబాద్ గేట్‌వేగా పిలువబడుతున్న క్లాక్‌టవర్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలంటూ మరో ఉద్యమం ఆవిర్భవించింది. వాస్తవంగా..తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలోనే సికింద్రాబాద్‌ను జిల్లాగా మారుస్తారని భావించగా అప్పట్లో ఆలోచనను విరమించుకున్నారు. దీంతో సికింద్రాబాద్ ప్రాంతానికి మరోమారు అన్యాయం జరిగిందని పలువురు న్యాయవాదులు, వివిధ రంగాల ప్రతినిధులు కొంతకాలం ఉద్యమాలు చేపట్టారు. ఎనిమిదేళ్ల తరువాత మళ్లీ లష్కర్ ప్రత్యేక జిల్లా ఉద్యమం ఊపిరిపోసుకుంటుంది. ఇందుకోసం వివిధ రంగాల ప్రతినిధుల ఆధ్వర్యంలో లష్కర్ ప్రత్యేక జిల్లా సాధన సమితి ఆవిర్భవించింది.

జై సికింద్రాబాద్ నినాదంతో.....

బేగంపేట విమానాశ్రయం, సికింద్రాబాద్ జంక్షన్ తోపాటు పలు రైల్వేస్టేషన్లు, రైల్వే కార్యాలయాలు, సైనిక స్థావరాలకు కేంద్రంగా ఉన్న సికింద్రాబాద్ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. న్యాయవాదులు, డాక్టర్లు, టీచర్లు, ఈ ప్రాంతంలోని వివిధ రంగాల ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జాగృతం చేసి లష్కర్ ప్రత్యేక జిల్లా సాధన సమితి నేతృత్వంలో నిరాటంకంగా ఆందోళనలు కొనసాగించాలని భావిస్తున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లను కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని ఉద్యమకారులు కోరుతున్నారు. ఇందుకోసం జై సికింద్రాబాద్ నినాదంతో ముందుకు వెళ్తామంటున్నారు.

పోరాడి జిల్లాను సాధిస్తాం

కేంద్ర, రాష్ట్ర కేబినెట్ మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను వ్యక్తిగతంగా కలిసి జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తాం. సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ద్వారా మునుపటి మాదిరి ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటయ్యేంత వరకు శాంతియుత ఉద్యమాలు కొనసాగిస్తాం. ఇందుకోసం ఏడు శాసనసభ నియోజకవర్గాల ప్రజల మద్దతు కూడగడతాం. రాజకీయాలకు అతీతంగా ఉద్యమాన్ని కొనసాగిస్తాం.

–గుర్రం పవన్‌కుమార్ గౌడ్, అధ్యక్షుడు, జిల్లా సాధన సమితి